## బీఆర్ఎస్ నాయకుడికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ



బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు సాయిలును పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

ఆమనగల్లు, మే 19 : ఆమనగల్లు మున్సిపాలిటీకి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు వస్పుల సాయిలు మాతృమూర్తి మైసమ్మ మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ సోమవారం ఆమె మృతిపై ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట మాజీ ఏఎంసీ చైర్మన్ నాలపురం శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు నేనావత్ పత్యానాయక్, సీనియర్ నాయకులు లాలయ్య గౌడ్, సయ్యద్ ఖలీల్, సైదుల్ గౌడ్, భాస్కర్, జంగయ్య తదితరులు ఉన్నారు.

## యువతి వివాహానికి పుస్తె మెట్టెలు అందజేత



పుస్తె మెట్టెలు అందజేస్తున్న ప్రేమ్‌కుమార్‌గౌడ్

కేశంపేట, మే 19 : మండలంలోని కొండారెడ్డిపల్లికి చెందిన యువతి వివాహానికి బీఆర్ఎస్ యువ నాయకుడు ప్రేమ్‌కుమార్‌గౌడ్ సోమవారం పుస్తె మెట్టెలను అందజేశారు. ఈ సందర్భంగా ప్రేమ్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. గ్రామానికి చెందిన లలిత ఆచారి మనువరాలు అనూష వివాహాన్ని చేసేందుకు పెద్దలు నిశ్చయించారు. నిరుపేద కుటుంబానికి చెందిన యువతికి తండ్రి లేకపోవడంతో బీఆర్ఎస్ తరపున పుస్తె మెట్టెలు చేయించి ఇచ్చామన్నారు. కార్యక్రమంలో రవీందర్‌గౌడ్, భారతమ్మ, ఉదయ్‌గౌడ్, శ్రీకాంత్‌గౌడ్, శ్రీశైలంయాదవ్, రఘు, తదితరులు పాల్గొన్నారు.

## అర్హులకే ఇండ్లు అందేలా కృషి చేస్తాం



హైతాబాద్‌లో లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్‌లు అందజేస్తున్న మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్

షాబాద్, మే 19 : గ్రామాల్లో అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లు అందించేలా కృషి చేస్తామని గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని హైతాబాద్‌లో ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన లబ్ధిదారులకు ప్రొసీడింగ్‌లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అర్హులైన లబ్ధిదారులు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఖాజమియాపటేల్, గ్రామస్తులు శ్రీనివాస్‌రెడ్డి, యాదయ్య, ఆండాళు, కొమ్రమ్మ, శ్రీరాములు, బురాన్ తదితరులు పాల్గొన్నారు.

# భూసార పరీక్షలు తప్పనిసరి

- జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్త డాక్టర్ ప్రవీణ్‌కుమార్
- పంటల సాగు పద్ధతులపై రైతులకు అవగాహన



మొయినాబాద్ : కేతిరెడ్డిపల్లిలో రైతులతో మాట్లాడుతున్న శాస్త్రవేత్త డాక్టర్ రవీందర్

మొయినాబాద్, మే 19 : అధిక దిగుబడులు సాధించడానికి తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్త డాక్టర్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. రాజేంద్రనగర్‌లోని జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ శాఖ సంయుక్తంగా నిర్వహిస్తున్న రైతు ముంగిట్లోకి వ్యవసాయ శాస్త్రవేత్తలు కార్యక్రమం మండల పరిధిలోని కేతిరెడ్డిపల్లిలో సోమవారం మండల వ్యవసాయ అధికారి అనురాధ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంటకు ఎంత మోతాదులో రసాయన ఎరువులు వేయాలో ముందుగా భూసార పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి అనురాధ, వ్యవసాయ విస్తరణ అధికారి కుమార్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దారెడ్డి వెంకట్‌రెడ్డి, సీనియర్ నాయకులు రెడ్డమోని యాదయ్య, రైతులు పాల్గొన్నారు.

### పెంజర్లలో..

**కొత్తూరు :** సరైన సాగు పద్ధతులతో అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ శాస్త్రవేత్త ప్రొఫెసర్ ఏవీ రామాంజనేయులు అన్నారు. కొత్తూరు మండల పరిధిలోని పెంజర్లలో జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ శాఖల ఆధ్వర్యంలో రైతు ముంగిట్లో వ్యవసాయ శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు నూతన వంగడాలు, మొక్కజొన్న, పత్తి, వరిలో ఆశించే చీడపీడలపై రైతులకు వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి గోపాల్, పీహెచ్‌డీ విద్యార్థులు కావ్య, శ్రీను, ఏఈవో దీపిక, రైతులు పాల్గొన్నారు.

### అనాజ్‌పూర్‌లో..

**అబ్దుల్లాపూర్‌మెట్ :** మండల పరిధిలోని అనాజ్‌పూర్‌లో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా పలువురు శాస్త్రవేత్తలు పంటల సాగుకు సంబంధించి పలు అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్త బాలాజీనాయక్, పంచాయతీ కార్యదర్శి సూరిబాబు, ఏఐవోఎస్ రఘుపతి, రైతులు భూపాల్‌రెడ్డి, నర్సింహ ముదిరాజ్, నార్లకొండ జంగమయ్యయాదవ్, దామోదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మినరల్ వాటర్ పేరిట అక్రమ నీటిదందా



వాటర్‌ప్లాంట్ వద్ద అపరిశుభ్రంగా ఉన్న తాగునీటిని నింపిన బాటిళ్లు

ఇబ్రహీంపట్నం, మే 19 : నియోజకవర్గ పరిధిలో మినరల్ వాటర్ పేరిట బోరు నీటిని విక్రయిస్తున్నారు. మిషన్ భగీరథ నీరు సరిపోకపోవడంతో పలువురు నీటిని కొనుగోలు చేస్తున్నారు. ఇదే అదునుగా భావించిన మినరల్ వాటర్ ప్లాంట్ల యజమానులు నీటిని శుద్ధి చేయకుండానే బోరు నీటిని విక్రయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. వాటర్ ప్లాంట్లకు అనుమతులు లేకపోవడంతో పాటు కనీస నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా నీటి శుద్ధి కేంద్రాలను నడుపుతున్నారు. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీతో పాటు మండల పరిధిలోని పలు గ్రామాల్లో సుమారు 250వరకు నీటిశుద్ధి కేంద్రాలున్నాయి. వీటిలో 20లీటర్ల వాటర్‌క్యాన్ రూ.30చొప్పున విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. వీటిపై అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో తాగునీటి అక్రమ వ్యాపారం జోరుగా సాగుతున్నది.

## తోటి మిత్రుడికి ఆర్థిక సాయం



వినోద్ తల్లిదండ్రులకు ఆర్థిక సాయం అందజేస్తున్న తోటి మిత్రులు

ఆమనగల్లు, మే 19 : మండల పరిధిలోని శంకర్ కొండ గ్రామ పంచాయతీకి చెందిన దయ్యాలబోడ్ తండా నివాసి వి.వినోద్ అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు దవాఖానాలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న తండాకు చెందిన తోటి మిత్రులు కలిసి రూ. 16వేల నగదును వినోద్ తల్లిదండ్రులకు అందజేశారు. కార్యక్రమంలో తోటి మిత్రులు రాజు, రాజేశ్, శ్రీను, నవీన్, ప్రవీణ్, రవి, శ్రీనివాస్, పుల్‌సింగ్, జైలాల్, శ్రీను, విజయ్ తదితరులు ఉన్నారు.

## పుచ్చలపల్లిని ఆదర్శంగా తీసుకోవాలి



యాచారం: సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

యాచారం, మే 19 : బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్యను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి ఆలంపల్లి నర్సింహ అన్నారు. మండల కేంద్రంలో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించారు. సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అట్టడుగు వర్గాల సమస్యల పరిష్కారం కోసం సుందరయ్య చేసిన సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు అంజయ్య, బ్రహ్మయ్య, జంగయ్య, అరుణ, వినోద్, గడ్డం కుమార్, చందూనాయక్ తదితరులు పాల్గొన్నారు.

**తుర్కయాంజాల్ :** మున్సిపాలిటీ పరిధిలో సీపీఎం ఆధ్వర్యంలో పుచ్చలపల్లి సుం దరయ్య వర్ధంతి నిర్వహించారు. ఈ సం దర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం రంగారెడ్డి జిల్లా కమిటీ సభ్యుడు, తుర్కయాంజాల్ మున్సిపల్ కార్యదర్శి కిశన్, నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

**మంచాల :** పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలోని కృష్ణమూర్తి భవనంలో సీపీఎం ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య, మండల కార్యదర్శి రావుల జంగయ్య, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, బుగ్గ రాములు, పోచమోని కృష్ణ, కందుకూరి జగన్, లెలిన్, సుధాకర్, ఎన్ జంగయ్య, వెంకటేశ్, బాల్‌రాజ్, కవిత, ఆనంద్, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.



తుర్కయాంజాల్: సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

## ఫిల్టర్ ఇసుక తయారు చేస్తే చర్యలు తప్పవు



ఫిల్టర్ ఇసుక ప్రాంతాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

కొందుర్గు, మే 19 : చౌదరిగూడ మండల పరిధిలో అక్రమంగా తయారవుతన్న ఫిల్టర్ ఇసుక ప్రాంతాన్ని పోలీసులు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్సై విజయ్ మాట్లాడుతూ.. ఎవరైనా సంఘ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఫిల్టర్ ఇసుకను తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో ఘటనా స్థలాన్ని పరిశీలించామని, అనుమతులు లేకుండా ఎవరైనా ఇకపై ఫిల్టర్ ఇసుకను తయారు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## అసంపూర్తి భవనాల పరిశీలన



పాపిరెడ్డిగూడలో అసంపూర్తి భవనాన్ని పరిశీలిస్తున్న పీఆర్ ఏఈ నర్సింగ్‌రావు

కేశంపేట, మే 19 : మండల పరిధిలోని పాపిరెడ్డిగూడలో అసంపూర్తిగా ఉన్న భవనాలను పంచాయతీ రాజ్ శాఖ ఏఈ నర్సింగ్‌రావు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ముదిరాజ్ భవనంతోపాటు ఎస్సీ కమ్యూనిటీ, పద్మశాలీ సంఘం భవనాలను పరిశీలించినట్లు మాజీ సర్పంచ్ శివయ్య తెలిపారు. కార్యక్రమంలో కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## నేడు సామాజిక తనిఖీపై ప్రజావేదిక

యాచారం, మే 19 : మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 16వ విడుత సామాజిక తనిఖీల్లో భాగంగా మండల ప్రజావేదిక–2025 కార్యక్రమాన్ని మంగళవారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శైలజ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ సభల్లో తనిఖీ బృందం సేకరించిన పలు అంశాలను ప్రజావేదికలో చర్చించనున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమానికి జిల్లా అధికారులు హాజరు కానున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ఈజీఎస్ అధికారులు, సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, కూలీలు, మాజీ ప్రజాప్రతినిధులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆమె కోరారు.

## నిరుపేదలకు స్థలాలు కేటాయించండి

పెద్దఅంబర్‌పేట, మే 19 : అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిధిలోని గౌరెల్లి గ్రామ రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్ 238లోని ప్రభుత్వ భూమిలో ఇండ్లు లేని నిరుపేదలకు స్థలాలు ఇవ్వాలని దళిత యూత్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గ్యార నర్సింహ కోరారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. అధికారులు స్పందించి నిరుపేదలకు పట్టా జాగలతోపాటు ఆర్థికసాయం అందించి ఇండ్లు నిర్మించుకునేందుకు సహకరించాలని కోరారు.

## రోడ్డు పక్కన మురుగు.. పరుగు



బ్రాహ్మణపల్లి ప్రధాన రోడ్డు పక్కను పారుతున్న మురుగు

తుర్కయాంజాల్, మే 19 : తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని బ్రాహ్మణపల్లి ప్రధాన రోడ్డుపై మురుగు పరుగు తీస్తున్నది. రోడ్డు పక్కన డ్రైనేజీ నుంచి మురుగు పారుతుండడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. దుర్వాసన భరించలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## గొప్ప యోధుడు ఛత్రపతి శివాజీ మహారాజ్



ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహావిష్కరణలో పాల్గొన్న ప్రముఖులు

చేవెళ్ల రూరల్, మే 19 : ధైర్యసాహసాలకు ప్రతీక ఛత్రపతి శివాజీ మహారాజ్ అని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ తెలంగాణ ప్రాంత భౌతిక ప్రముఖ్ కూర జయదేవ్ అన్నారు. ఆదివారం రాత్రి మండల పరిధిలోని మడికట్టు గ్రామంలో ఆ గ్రామ శివాజీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శివాజీ మహారాజ్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జయదేవ్ హాజరై స్థానిక నాయకులతో శివాజీ యూత్ సభ్యులతో కలిసి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శివాజీ మహారాజ్ చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, వెంకట్ రెడ్డి, గుండన్నగారి వెంకట్ రెడ్డి, బండారి ఆగిరెడ్డి, మున్నూరి శ్రీకాంత్, గోనే ప్రతాప్ రెడ్డి, డాక్టర్ మల్గారి వైభవరెడ్డి, మధు, శివాజీ యూత్, పలు సంఘాల నాయకులు గ్రామ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు



మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను సోమవారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మున్సిపల్ కమిషనర్ సునీతారెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ ఖాన్, మాజీ చైర్మన్ విశ్వం, నాయకులతో కలిసి ప్రారంభించారు. **- షాద్‌నగర్‌టౌన్, మే 19**



మండల పరిధిలోని వేముల్‌నర్వలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి మండల విద్యాధికారి, గ్రామ ప్రత్యేకాధికారి చంద్రశేఖర్ సోమవారం భూమిపూజ చేశారు. **- కేశంపేట, మే 19**

## నేడు నల్లవెల్లికి శాస్త్రవేత్తల రాక

యాచారం, మే 19 : రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని నల్లవెల్లి గ్రామానికి మంగళవారం వ్యవసాయ శాస్త్రవేత్తలు హాజరు కానున్నట్లు మండల వ్యవసాయ అధికారి రవినాథ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు వ్యవసాయ సాగుకు సంబంధించి సలహాలు, సూచనలు రైతులకు ఇస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమానికి రైతులు అధిక సంఖ్యలో హాజరు కావాలని ఆయన కోరారు.

## అల్వాలలో రెవెన్యూ సదస్సు

కేశంపేట, మే 19 : మండల పరిధిలోని అల్వాలలోని రైతు వేదికలో మంగళవారం ఉదయం 10 గంటలకు రైతులకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నామని మండల వ్యవసాయ విస్తర ణ అధికారి వినయ్ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ శాస్త్రవేత్తలు, అధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు పలు సూచనలు, సలహాలు అందజేస్తారని తెలిపారు. రైతులకు సంబంధించిన భూ ఆధార్ ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ సైతం కొనసాగుతుందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని రైతులు పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నందిగామ, మే 19 : బైకు ఢీకొని తీవ్ర గాయాలైన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన నందిగామ మండల పరిధిలోని చాకలిగుట్టతండాలో సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు.. వెస్ట్‌బెంగాల్‌కు చెందిన డీయో సింగ్ (51) కుటుంబంతో కలిసి చాకలిగుట్టతండాలో నివాసముంటున్నారు. ఆదివారం రాత్రి తాటిగడ్డతండాలో కిరాణ సరుకుల కోసం నడుచుకుం టూ వెళ్తుండగా బైకు ఢీకొనడంతో తీవ్రగాయాలయ్యాయి. వెంటనే క్షతగాత్రుడిని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ప్రసాద్ తెలిపారు.

## క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలి



క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు బహుమతులు అందజేస్తున్న రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు

మాడ్గుల, మే 19 : క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించి ముందుకు సాగాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని నల్లచెరువు గ్రామంలో శ్రీరెడ్డి నర్సింహారెడ్డి జ్ఞాపకార్థం నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ సోమవారం ముగిసింది. ఈ కార్యక్రమానికి శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. యువకులు చదువులతోపాటు, క్రీడల్లోనూ రాణించాలన్నారు. క్రీడలతో స్నేహ సంబంధాలు పెంపొందుతాయని, మానసికోల్లాసాన్ని కలిగిస్తాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారుల ప్రోత్సాహనికి ఆయన రూ.10 వేలు అందజేశారు. అనంతరం టోర్నమెంట్‌లో తొలి స్థానంలో నిలిచిన సాయి జట్టుకు రూ.10 వేలు, రెండో స్థానంలో నిలిచిన మల్లేశ్ టీమ్‌కు రూ.7,116లతోపాటు ట్రోఫీలను అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ తిరుమల్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు జంగయ్యగౌడ్, మాలతీకృష్ణారెడ్డి, యాదిరెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి, వెల్దండ మాజీ వైస్ ఎంపీపీ అనిల్‌కుమార్, మాజీ ఎంపీటీసీ వెంకటయ్యగౌడ్, నాయకులు తిరుపతిరెడ్డి, రామాంజనేయులు, జంగయ్య, శేఖర్, క్రీడకారులు తదితరులు పాల్గొన్నారు.

## దొంగతనాలపై అప్రమత్తంగా ఉండాలి



నల్లవెల్లిలో ప్రజలతో మాట్లాడుతున్న ఏసీపీ రాజు

యాచారం, మే 19 : దొంగతనాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు అన్నారు. మండల పరిధిలోని మాల్ చెక్‌పోస్టును సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. చెక్‌పోస్టు నిర్వహణపై పలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. స్థానిక పోలీసులకు పలురకాల సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం నల్లవెల్లిలో దొంగతనాలు, సైబర్ నేరాలపై ప్రజలు, యువకులు, వ్యాపారులకు ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏసీపీ రాజు మాట్లాడుతూ...గ్రామాల్లో జరిగే దొంగతనాలపై ప్రజలు ఎంతో అప్రమత్తంగా ఉండాలన్నారు. జనవాసాలు, సంతలు, బస్టాండ్లలో చైన్‌స్నాచింగ్‌పై మహిళలు జాగ్రత్తగా ఉండాలని ఆయన సూచించారు. అపరిచిత వ్యక్తులను నమ్మరాదని ఆయన సూచించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకున్నా వెంటనే 100 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. గ్రామాల కూడళ్లు, వ్యాపార దుకాణాల్లో సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. గంజాయి, రేషన్‌బియ్యం, పశువులు, మద్యం, మాదకద్రవ్యాలు తదితర అక్రమ రవాణాను అరికట్టాలని పోలీసులకు సూచించారు. కార్యక్రమంలో సీఐ నందీశ్వర్‌రెడ్డి, ఎస్ఐ మధు, ఏఎస్ఐ సక్రునాయక్, పోలీసు సిబ్బంది, ప్రజలు ఉన్నారు.

## నేటి నుంచి టీచర్లకు శిక్షణా తరగతులు



శిక్షణా తరగతి గదిని పరిశీలిస్తున్న ఎంఈవో పురందాస్

చేవెళ్లటౌన్, మే 19 : మండల పరిధిలోని ప్రాథమిక స్థాయి ఉపాధ్యాయులకు ఈ నెల 20 నుంచి 24 వరకు రెండో విడుత శిక్షణా తరగతులు చేవెళ్లలోని వివేకానంద ఇంటర్నేషనల్ స్కూల్‌లో నిర్వహిస్తున్నామని ఎంఈవో పురందాస్ తెలిపారు. సోమవారం ఆయన శిక్షణా తరగతులు నిర్వహించే గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శిక్షణా తరగతులకు ఉపాధ్యాయులు నిర్దేశించిన సమయానికి, అంశాలకు అనుగుణంగా హాజరు కావాలన్నారు. కార్యక్రమంలో డీఆర్పీలు, సీఆర్పీలు కృష్ణ, శంకర్, నర్సింహులు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక సమస్యలు పరిష్కరించాలి

### బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు జహీరుద్దీన్

వ్యవసాయ యూనివర్సిటీ, మే 19: కాలనీల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని సులేమాన్‌నగర్ బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు జహీరుద్దీన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం రాజేందర్‌నగర్ మున్సిపల్ కమిషనర్ రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సులేమాన్‌నగర్ డివిజన్‌లో కొన్ని నెలల నుంచి పారిశుధ్య పనులు చేపట్టడం లేదన్నారు. డ్రైనేజీ, తాగునీటి సమస్యలను సైతం ఎవరూ పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. సమీపంలో మిరియా ల ట్యాంక్ ఉండడంతో ఆ కాలనీ వీధి పొడవునా ఏపుగా పిచ్చి మొక్కలు పెరగడంతో వాటిలో విషసర్పాలు సంచరిస్తుండడంతో రాత్రివేళ భయం భయంగా తిరగాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. చనిపోయిన జంతువుల కళేబరాలు ఇక్కడే వదిలేస్తున్నారని ప్రధానంగా పాఠశాల సమీపంలో డైరీ ఫాం ఇందిరానగర్ సులేమాన్ నగర్ కాలనీలో పరిస్థితులు దుర్భరంగా తయారయ్యాయని మండిపడ్డారు. గతంలో ఈ సమస్యలను పలుమార్లు స్థానిక అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఎలాంటి ప్రయోజనం లేకపోవడంతో మరోసారి ప్రజావాణిలో సమస్యలను తమ దృష్టికి తీసుకువచ్చామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సైద్ అమీర్, షైక్ అమీర్, మహ్మద్ నవాజ్, జుబైర్ సైద్, షకీల్ అబ్దుల్, రెహమాన్, రవి కు మార్, మహ్మద్ ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.